సాక్షి
మంచిర్యాల

బుధవారం । 13 । మార్చి । 2024



'పది'ంతల ఆత్మవిశ్వాసం

ఐదురోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే సత్ఫలితాలు వస్తాయని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:26	గురు: 5:04

గరిష్టం/కనిష్టం
39.0 /24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 262 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మంగళవారం 262 మంది గైర్హాజరయ్యారు. 6,723 మంది విద్యార్థులకు 6,461 మంది హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 5,598 మందికి 5,367 మంది హాజరుకాగా 231 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 1,125 మందికి 1,094 మంది హాజరుకాగా 31మంది గైర్హాజరైనట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

పదవులకు బేరసారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులను దక్కించుకునేందుకు పలువురు డైరెక్టర్లు తోటి డైరెక్టర్లతో బేరసారాలకు దిగుతున్నట్లు తెలిసింది. సోమవారం గెలుపొందిన 11 మంది డైరక్టర్లు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. బుధవారం జిల్లా సహకారశాఖ కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నారు. పదవి ఆశిస్తున్న డైరెక్టర్లు ఇతర డైరెక్టర్లను క్యాంపునకు తరలించి కొంతమేర ముట్టజెప్పినట్లు తెలిసింది. ఒక్కో డైరెక్టర్‌కు రూ.70వేల వరకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. గెలుపొందిన ప్యానల్‌తో పాటు ఓడిపోయిన ప్యానల్‌కు సంబంధించిన డైరెక్టర్లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. 'ఐదేళ్ల పదవీ కాలంలో రెండున్నరేళ్లు నేను.. మరో రెండున్నరేళ్లు నువ్వు' అనే రీతిలో ఓ డైరెక్టర్ ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదని తెలిసింది.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



విద్యార్థిని ప్రశ్న అడుగుతున్న డీఈవో

నెన్నెల: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ నెన్నెల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాశ్‌రావుపై డీఈవో యాదయ్య తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక తనిఖీ చేశారు. హాజరు పట్టికలో లీవ్, ఓడీ (ఆన్‌డ్యూటీ) లాంటి వివరాలు నమోదు చేయకుండా ఖాళీగా ఉంచడంతో నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. విధులను నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పరీక్షా కేంద్రంలోని వసతులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు గణితం ప్రశ్నలు వేయగా ఒక్కరూ సమాధానం చెప్పలేదు. దీంతో 'ఇదేనా బోధన తీరు' అని ఉపాధ్యాయులను మందలించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎంపీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మంగళవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతీలాల్, ఎల్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి డీ చంద్రకళతో కలిసి వీడియో, ఫ్లయింగ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, వీడియో విజిలెన్స్ బృందాలు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ శాసనసభ నియోజకవర్గంలో మూడు కంటే ఎక్కువ ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు, కానుకల పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కలెక్టరేట్‌లో 1950 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కారు డీలా..



- అధికారం కోల్పోయి పట్టించుకోని పార్టీ
- ఎంపీ ఎన్నికల వేళ కేడర్‌లో నారాజ్
- బీఆర్‌ఎస్‌ను వీడుతున్న నాయకులు
- కాంగ్రెస్, బీజేపీలో చేరేందుకు ఆసక్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గులాబీ పార్టీ నుంచి ఇతర పార్టీలకు వలసల పరంపర కొనసాగుతోంది. దశాబ్దం పాటు జిల్లాలో రాజకీయం, అధికారంలో ఉంటూ ఓ వెలుగు వెలిగిన బీఆర్‌ఎస్ క్రమక్రమంగా బలహీనపడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడంతో 'కారు' కేడర్ ఒక్కసారిగా డీలా పడింది. ఆ తర్వాత సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ చతికిలపడింది. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, చైర్మన్లు, మండల, నియోజకవర్గ, జిల్లా నాయకుల్లో ఉత్సాహం సన్నగిల్లింది. కింది స్థాయి నాయకులు ఇప్పటికే పార్టీ వీడారు. జిల్లాలో జెడ్పీటీసీ సభ్యులు మూకుమ్మడిగా కారు దిగేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత కాంగ్రెస్‌లో చేరగా, అదే దారిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ ఉన్నారు. వీరితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే కూడా అంతర్గతంగా చర్చలు జరుపుతున్నారు. అయితే ఏ పార్టీలో చేరితే బెటర్ అనే ఆలోచన చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపా?.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైపా? ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఏ పార్టీలోకి వెళ్తే భవిష్యత్ బాగుంటుంది.. అని సమాలోచనలు చేస్తున్నారు. ఈ లెక్కలన్నీ కుదిరాకే కండువాలు మార్చుకుంటున్నారు.

గత అక్రమాల చిట్టాలతో..

గత సర్కారు హయాంలో చాలామంది అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. కొందరిపై కేసులూ నమోదయ్యాయి. భూ కబ్జాలు, సెటిల్మెంట్లు, ఇసుక దందా, ప్రైవేట్ పంచాయితీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఇతర రంగాల్లో ఉన్నవారిపై చాలా చోట్ల కేసులు నడుస్తున్నాయి. ఈ కేసులను తట్టుకోవాలంటే కండువా మార్చుకోవాలనే ధోరణితో పలువురు నేతలున్నారు. అయితే ఇన్నాళ్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. దీంతో తమ పార్టీలోకి రాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకులే అడ్డుగా ఉంటున్నారు. చెన్నూరు, బెల్లంపల్లి పరిధిలో కొందరిని పార్టీలోకి రాకుండా నిలువరిస్తున్నారు. దీంతో ముందుకు వెళ్లలేక, బీఆర్‌ఎస్‌లో ఉండలేక సదరు నేతలు సతమతమవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

పట్టించుకోవడంలేదనే ఆవేదనతోనే..

అధికారంలో లేకపోయినా ఇంకా కొందరు విశ్వాసంతో పార్టీలో పని చేస్తున్నారు. అయితే పార్టీ జిల్లా బాధ్యులు పట్టించుకోకపోవడంతో వారు నారాజ్‌లో ఉన్నారు. కనీసం మనోధైర్యం నింపే నాయకత్వం కరువైందనే విమర్శలూ వస్తున్నాయి. మంచిర్యాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు పార్టీ కోసం పని చేస్తున్నారు. వీరు మినహా బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్‌లో కార్యకర్తల బాగోగులు చూసేవారే లేకుండా పోయారు. సర్కారు మారాక నాయకులు, కార్యకర్తలపై కక్ష పూరితంగా కేసులు పెడుతున్నారంటూ గగ్గోలు పెడుతున్నా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కనీసం స్పందించడంలేదు. దీంతో పార్టీ వీడటమే బెటర్ అనే స్థితికి చేరారు. ఓ వైపు లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ముందు కేడర్‌ను పటిష్టం చేసుకోవాలిసిన బాధ్యత ముఖ్య నాయకులపై ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ప్రజల్లోనూ పార్టీ పట్టుకోల్పోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఏ మేరకు ఓట్లు పడతాయోనని పార్టీ కేడర్‌లో ఆందోళన మొదలైంది.

గత కమిషనర్ రమేశ్‌పై సస్పెన్షన్ వేటు



సాక్షి ఎఫెక్ట్

తన్నీరు రమేశ్

నస్పూర్: మున్సిపల్ గత కమిషనర్ తన్నీరు రమేశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఫిబ్రవరి 18న 'బదిలీ వేళ అనుమతులు' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆ మరుసటి రోజే వరంగల్ రీజియన్ డైరెక్టర్ (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) షాహిద్ మసూద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌పై విచారణ చేపట్టారు. అనంతరం రమేశ్‌ను సిద్దిపేట జిల్లా చేర్యాలకు బదిలీ చేస్తూ ఫిబ్రవరి 13న ఉత్తర్వులు వెలువడ్డాయి. రమేశ్ సెలవులో ఉండి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాక ఫిబ్రవరి 14న తొమ్మిది ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చారు. అంతే కాకుండా తొమ్మిది ఇళ్లలో ఏడింటికి టీపీఎస్ అప్రూవల్ ఇచ్చారు. మరో రెండు ఇళ్లకు టీపీఎస్ అప్రూవల్ ఇవ్వకుండానే నేరుగా అనుమతులిచ్చారు. ఈ నేపథ్యంలో డీఎంఏ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. రమేశ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఎంఏ జాయింట్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రమేశ్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రాణాలైన వదుల్తాం.. భూములివ్వం



జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రెండు మండలాల రైతులు

- పాత రహదారితో రోడ్డు విస్తరించాలి
- హాజీపూర్, లక్సెట్టిపేట రైతుల డిమాండ్
- రాస్తారోకోలు, ఆందోళనలతో నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రాణాలైనా వదులుకుంటాం.. కానీ.. భూములిచ్చే ప్రసక్తే లేదని హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల రైతులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీన మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ ఉందని, రెండు మండలాలకు చెందిన 200 మంది భూబాధితులకు అధికారులు నోటీసులిచ్చారని తెలిపారు. దీంతో సోమవారం ఉదయం 10గంటలకు ఆర్డీవో కార్యాలయానికి వచ్చామని పేర్కొన్నారు. కనీసం తాగునీరు, నీడ సౌకర్యం కల్పించలేదని వాపోయారు. పంట పొలాల్లోంచి ఎన్‌హెచ్–63 రహదారి విస్తరణ వద్దని, ఇప్పటికే ఉన్న రహదారిని వెడల్పు చేయాలని కోరారు. రైతులమంతా ఒకే అభిప్రాయంతో ఉన్నామని తెలిపారు. తమ అభిప్రాయం తెలుసుకునేందుకు రావాలని వేడుకున్నా ఆర్డీవో రాలేదని వాపోయారు. ఒకరిద్దరు రైతులనే కార్యాలయంలోకి రావాలనడం ఏమిటని ప్రశ్నించారు. గంటపాటు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఆర్డీవో బయటకు రాక పోవడంతో ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. పోలీసులు వచ్చి ఆర్డీవోతో మాట్లాడిస్తామని హామీ ఇవ్వగా రాస్తారోకో విరమించి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఆర్డీవో రాములు రైతులతో మాట్లాడారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంతో విలువైన వందల ఎకరాలు, ఇళ్లు కోల్పోవాల్సి వచ్చిందని వాపోయారు. ఉన్న కొద్దిపాటి భూములను రోడ్డు విస్తరణతో లాక్కుంటే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తంజేశారు. పాత రహదారి గుండానే రోడ్డు విస్తరించాలని కోరారు. దీంతో ఆర్డీవో స్పందిస్తూ రైతుల అభిప్రాయాలు సేకరించి, ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందరి ఏకాభిప్రాయంతో రిజిస్టర్లతో సంతకాలు సేకరించారు.

మల్లన్న జాతర ఆదాయం రూ.15.95లక్షలు

చెన్నూర్‌రూరల్: కత్తెరసాల గ్రామంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన జాతరలో వచ్చిన హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.15.95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. హుండీ ద్వారా రూ.6,78,721, బహిరంగ వేలం ద్వారా రూ.3.15లక్షలు, పట్నం రసీదుల ద్వారా రూ.2,51,900, ప్రత్యేక దర్శనం రసీదుల ద్వారా రూ. 1,07,550, సులభ దర్శనం ద్వారా రూ. 1,59,700, కొబ్బరిముక్కల ద్వారా రూ. 13,500, తైబజార్ ద్వారా రూ.68,700 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. మూడు గ్రాముల 310మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, 519 గ్రాముల 240మిల్లీ గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, సిబ్బంది పరమేశ్, గోపి, ఒగ్గు పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పది'కి నిమిషం నిబంధన లేదు

- పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత లక్ష్యం
- 52 పరీక్షా కేంద్రాలు.. విద్యార్థులు 9,637
- విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు
- చదువుతోపాటు నిద్రకు సమయం కేటాయించాలి
- డీఈవో యాదయ్య



మంచిర్యాలఅర్బన్: ''పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రణాళిక అమలు చేశాం. ప్రత్యేకంగా ముద్రించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశాం. ప్రత్యేక తరగతుల నిర్వహణతో విద్యార్థులను సన్నద్ధం చేశాం. ప్రీఫైనల్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు మండలాల వారీగా ప్రేరణ కార్యక్రమాలు చేపట్టాం. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం..'' అని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యాదయ్య అన్నారు. ఈ నెల 18నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనుండగా 'సాక్షి' డీఈవోతో ఇంటర్వ్యూ నిర్వహించింది.

ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

డీఈవో: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. జిల్లాలో 9,637మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరిలో 9,298మంది రెగ్యులర్, 339మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. ప్రతీ కేంద్రంలో విద్యుత్, ఫ్యాన్లు, తాగునీరు, డ్యూయల్ డెస్క్ బెంచీలు, మౌలిక వసతులు కల్పించాం.

పరీక్షల నిర్వహణకు చేపట్టిన చర్యలు..

డీఈవో: ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలు తెరవనున్నాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 52 మంది సీఎస్‌లు, 52మంది డీవోలు, 532మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం. చూచిరాతకు పాల్పడితే చర్యలు తప్పవు. ఏ ఒక్కరికీ పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదు.

పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు చేశారు..

డీఈవో: ఈ నెల 18నుంచి ఏప్రిల్ 2వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఇదివరకు సెలవు దినాల్లో మినహాయిస్తే తప్ప పరీక్షల షెడ్యూల్ వరుసగా ఉండేది. తెలుగు, హిందీ తప్ప మిగతా పరీక్షలకు రోజు విడిచి మరో రోజు పరీక్షలు ఉండడంతో విద్యార్థులు చదువుకోవడానికి మరింత సమయం కలిసి వస్తోంది. ఇది వరకు పది పరీక్షలకు ఆరు పేపర్లు ఉండేవి.

నిమిషం నిబంధన అమలులో ఉంటుందా..?

డీఈవో: నిమిషం నిబంధన లేదు. ఐదు నిమిషాలు వెసులుబాటు కల్పించారు. పరీక్షా కేంద్రాలను ముందు రోజు చూసి వెళ్తే బాగుంటుంది. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష ఉంటుంది. కేంద్రాల్లోకి ముందుగానే అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

ఈసారి ఏడు పేపర్లకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్‌ను పార్ట్–1గా, బయోలాజికల్ సైన్స్ పార్ట్–2గా నిర్వహించనున్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారా..

డీఈవో: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందజేస్తారు. పదో తరగతి విద్యార్థులు పాఠశాల యాజమాన్యంతో సంబంధం లేకుండా htpp:///www. bse. telangana. gov. in డీఈవో తెలంగాణ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు.

విద్యార్థులకు మీరిచ్చే సలహా, సూచనలు

డీఈవో: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఇంట్లో తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకుండా అనువైన వాతావరణం కల్పించాలి. విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. చదువుతోపాటు నిద్రకు సమయం కేటాయించాలి. ఆరోగ్య సూత్రాలు పాటించి పుస్తక పఠనంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి. ఇంకా పరీక్షల నిర్వహణపై ఎలాంటి సందేహాలున్నా 7032463114 నంబర్‌లో సంప్రదించవచ్చు.

'సవరణ' పాట్లు!

- పలువురికి అందని 'గృహజ్యోతి'
- దరఖాస్తుల సవరణకు అవకాశం
- ప్రజాపాలన కేంద్రాలకు అర్హులు
- కిటకిటలాడుతున్న ఆఫీసులు



మంచిర్యాల ప్రజాపాలన కౌంటర్ వద్ద దరఖాస్తుదారులు



దండేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..

మంచిర్యాలటౌన్/దండేపల్లి: ఆరు గ్యారంటీల్లోని గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు ఇచ్చిన దరఖాస్తుల్లో తప్పులు సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 4నుంచి మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవాకేంద్రాలు ప్రారంభించింది. దీంతో గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకుని జీరో బిల్లులు రాని అర్హులు ప్రజాపాలన కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద రూ.500కే అందించే గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేయనివారు కూడా తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు, దరఖాస్తు చేసినవారు దొర్లిన తప్పులను సవరించుకునే పనిలో పడ్డారు. అలాగే సోమవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కావడం, మహిళల పేరిటే ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో దరఖాస్తు చేసుకునేందుకు వందల సంఖ్యలో మహిళలు ప్రజాపాలన కేంద్రాలకు చేరుకుంటున్నారు.

రద్దీగా కార్యాలయాలు

గృహజ్యోతి పథకం కింద ఆహారభద్రత కార్డులున్న వారందరికీ 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తూ జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడంతో దరఖాస్తు చేసుకుంటున్నారు. గత ప్రజాపాలనలో జిల్లావ్యాప్తంగా 2,54,912 మంది వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 30 శాతానికి పైగా దరఖాస్తుల్లో తప్పులు దొర్లాయి. ఎక్కువగా గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ కనెక్షన్ల నంబర్లు కొందరు వేయలేదు. మరికొందరు గ్యాస్ కనెక్షన్ల నంబర్లు నమోదు చేయలేదు. మరికొందరు తప్పుగా నమోదు చేశారు. గ్యాస్‌కనెక్షన్ భార్య పేరిట కాకుండా భర్త పేరిట ఉండడం, దరఖాస్తు సమయంలో భార్య పేరు రాసి, ఆధార్ నంబర్ కూడా భార్యదే ఇవ్వడం లాంటి వాటిని సవరిస్తున్నారు. ఎవరి పేరిట గ్యాస్ కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ ఉంటే వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా ఇవ్వాలనడంతో ప్రజాపాలన కేంద్రాల్లో సవరించుకుంటున్నారు. 100 శాతం సబ్సిడీతో రూ.5లక్షలు అందించే ఇందిరమ్మ పథకం వర్తింపు కోసం కూడా మహిళల పేరిట దరఖాస్తు చేస్తున్నారు. కాగా, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడం, వీరికి ఎప్పటి నుంచి పథకాలు అమలు చేస్తారనే దానిపై స్పష్టత లేదు. దీంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు.

ఆందోళన వద్దు

అర్హతలుండి గృహజ్యోతి వర్తించని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లు ప్రజాపాలన ప్రత్యేక కౌంటర్ వద్ద అందించాలి. దరఖాస్తుదారులు వివరాలు సరిగా నమోదు చేయకపోయినా, ఆన్‌లైన్ సమయంలో తప్పులు దొర్లినా సవరించి అర్హులకు పథకాలు వర్తింపజేస్తాం.

– ప్రసాద్, ఎంపీడీవో, దండేపల్లి

ఎన్నికల ఏర్పాట్లలో ఉండాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, సబావత్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, ఎల్‌ఏ, ఆర్‌ఆర్‌స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ?

- 15న సీఎం రేవంత్‌రెడ్డి రాక
- ఏర్పాట్లు చేస్తున్న సింగరేణి అధికారులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలో సింగరేణి సంస్థ 600 మెగావాట్ల రెండు థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా రాష్ట్రానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని విస్తరింపజేస్తూ 2015మార్చిలో మూడో యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. కానీ.. పెద్దగా దృష్టి సారించకపోవడంతో టెండర్ల దశకు చేరుకోవడానికే తొమ్మిదేళ్లు పట్టింది. మూడో యూనిట్ 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ టెండర్లలో బీహెచ్‌ఈఎల్ 20శాతం అదనంగా కోట్ చేయడంతో సింగరేణి సంస్థ రద్దు చేసింది. దీంతో మూడో యూనిట్ నిర్మాణంపై అనుమానాలు తలెత్తాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాంట్ విస్తరణపై దృష్టి సారించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కొత్త ప్లాంట్‌కు సంబంధించి అన్ని రకాల పనులు చేపట్టగా టెండర్ల దశలో ఉన్నాయి. ఇక భూమిపూజకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనకు కసరత్తు జరుగుతోంది. కాగా, సీఎం బిజీ షెడ్యూల్, పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుండడంతో ముందుగా ఉంటుందా..? ఎన్నికల తర్వాత ఉంటుందా అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

క్లుప్తంగా

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వర ఆలయం, మహంకాళి దేవాలయాల్లో ఆదివారం రాత్రి వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడిన విషయమై ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి కంది రవిగా గుర్తించి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడిన వ్యక్తిని 24 గంటల్లోనే అరెస్టు చేసిన ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అశోక్‌నగర్ బస్తీ సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం మంటలు అంటుకుని పేలిపోయింది. కొన్నాళ్ల క్రితం విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డిస్కం అధికారులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న చెత్తకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని క్రమంగా మంటలు చెలరేగి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకుని పేలిపోయింది. దీంతో కాల్‌టెక్స్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సమాచారం అందుకుని విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో డిస్కంకు సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



విజేత జట్టుతో ఎఫ్‌డీవో విజయ్‌కుమార్

కాసిపేట: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని ముందుకు సాగాలని అటవీశాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని తాటిగూడలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. మొదటి బహుమతి బుగ్గగూడ జట్టు, రెండో బహుమతి రాంపూర్ జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు పని చేస్తాయని అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడంతో పాటు అటవీ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ముందుకు సాగుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఎఫ్ఆర్వో సుభాష్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, ఎఫ్‌బీవోలు సురేష్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు

వాంకిడి: అట్రాసిటీ కేసులో ఇద్దరిని జైలుకు తరలించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని గణేష్‌పూర్ గ్రామానికి చెందిన చిక్రం భీంరావుపై అదే గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు షేక్ అబ్దుల్, షేక్ మహబూబ్‌లను కులం పేరుతో తిట్టి, కర్రలతో దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గతంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	విద్యార్థుల సంఖ్య
నిర్మల్	8,923
ఆదిలాబాద్	10,511
మంచిర్యాల	9,637
కుమురంభీం	6,425



విద్యార్థుల సన్నద్ధతను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి(ఫైల్)



'పది'ంతల ఆత్మవిశ్వాసం

- పది జీపీఏ లక్ష్యంగా... • సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఈ నెల 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు • ఇప్పటికే ప్రీఫైనల్, ప్రత్యేక మోడల్ పరీక్షలు పూర్తి

పదో తరగతి పరీక్షలు మరో ఐదురోజుల్లో ప్రారంభం కానున్నాయి. అయితే సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో కొంతమేర ఆందోళన ఉన్నా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే మంచి ఫలితాలు రాబట్టవచ్చని మానసికనిపుణులు, సబ్జెక్టు విషయ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. తొలిసారిగా బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం ఎంతో ఉత్కంఠ నెలకొంటుంది. అయితే ఏడాదంతా చదివిన పాఠాలను మూడు గంటల్లో సమాధానాలు రాసి మంచి ఫలితాలను సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యార్థికి ఒత్తిడి, ఆందోళన సహజమే. అయినా ప్రశాంతంగా ఉంటూ దృఢచిత్తంతో పరీక్షలు రాస్తే సానుకూల ఫలితాలు ఉంటాయి. రానున్న ఐదు రోజులు పాటించాల్సిన జాగ్రత్తలు, పరీక్షలను ఎదుర్కోవాల్సిన తీరును విషయ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. – నిర్మల్‌ఖిల్లా

మాతృభాషను అశ్రద్ధ చేయొద్దు



మాతృభాషను అశ్రద్ధ చేయకుండా ప్రతీ పాఠ్యాంశాన్ని సంగ్రహాత్మకంగా చదవాలి. ఉపవాచకం చదవడం, ముఖ్య ఘట్టాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ పెరుగుతుంది. పరిచిత, అపరిచిత పద్య, గద్యాలను బాగా చదివి అర్థం చేసుకోవడం ద్వారా సమాధానాలు సులభంగా రాయవచ్చు. లేఖ, కరపత్రం, సంభాషణ, వ్యాసం, ఆత్మకథ, ఏకపాత్రాభినయం వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఓవైపు సాధన చేస్తూనే మరోవైపు ఉల్లాసంగా ఉండాలి. సంధులు, సమాసాలు వంటివాటికీ సమయం కేటాయించి చదివితే పూర్తి మార్కులు సాధించవచ్చు.
– కొండూరి పోతన్న, తెలుగు విషయ నిపుణులు, జెడ్పీహెచ్ఎస్, వెల్మల్ బొప్పారం

పొందికగా రాస్తే హిందీకే మార్కులు



హిందీ జాతీయ భాష. ఇందులో ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది. ప్యాసేజీ రైటింగ్‌లో ఇచ్చిన అంశాన్ని క్షుణ్ణంగా చదివితే జవాబులు ఈజీగా రాబట్టవచ్చు. ప్రతీ పాఠ్యాంశంలోని కవి పరిచయాన్ని పూర్తిగా చదవాలి. వ్యాకరణాంశాలు, భాషకి బాత్, అభ్యాసం చేయాలి. సంధులు, ఉపసర్గ వంటివి నేర్చుకుంటే సులభంగానే 10 జీపీఏ సాధించవచ్చు. ఇక పార్ట్ బి పైన కూడా కొట్టివేత, రాత దోషాలు లేకుండా రాయాలి. పద్యభాగం భక్తిపథ్, నీతి దోహే పాఠ్యాంశాలు ముఖ్యమైనవి.– కే.రేఖ, హిందీ పండిత్, జెడ్పీహెచ్ఎస్, మంజులాపూర్

కృత్యాలు, అనువర్తనాలు ఆకళింపు ముఖ్యం



భౌతిక రసాయన శాస్త్రాల్లోని ప్రతీ అంశానికి సంబంధించిన కీలక పదాలు చదవాలి. పాఠ్యాంశాల్లోని కృత్యాలు, బొమ్మలు, అనువర్తనాలు గుర్తించుకుని చదివితే జ్ఞాపకముంటుంది. రోజూ సమాధానాలను సాధన చేయడం ద్వారా మంచి మార్కులను సాధించవచ్చు. ఉపయోగాలు–అనువర్తనాలు చదవాలి. ప్రతీ యూనిట్ పూర్తయ్యాక పునఃశ్చరణ చాలా ముఖ్యం. గత పరీక్ష ప్రశ్నలను సాధన చేస్తే ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో గ్రహించవచ్చు. – సీహెచ్ వందన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, భోసి

విశ్లేషణ ద్వారానే మంచి మార్కులు



సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలను విశ్లేషణ పూరితంగా చదివితే సులువుగా గుర్తుంటాయి. కీలక అంశాలు, దేశ, ప్రపంచ పటాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ చేయవచ్చు. భారతదేశ పటంలోని పీఠభూములు, తీరమైదాన ప్రాంతాలు, నదులు, రాష్ట్రాలు గుర్తించేలా ప్రాక్టీసు చేయాలి. ప్రపంచ పటంలో దేశాలు, ప్రధాన కార్యాలయాలు, సముద్రాలను గుర్తించగలగాలి. భూగోళం, భూగర్భ జలాలు, కుల వివక్ష, బాలిక విద్య వంటి అంశాలపై, భారతదేశ చరిత్ర వంటి విషయాలను విశ్లేషణచేస్తూ చదవాలి. ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయడం కీలకం.
– సిలారి మధు, సాంఘికశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

ఇష్టపడి చదివితే ఇంగ్లిష్ ఈజీ



ప్రశ్న పత్రం తీసుకున్న తర్వాత అందులో ఉన్న ప్రశ్నలను చూసి ఆందోళన చెందకూడదు. క్షుణ్ణంగా చదివి ఏ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాయనున్నామో ఆకళింపు చేసుకోవాలి. పేరాగ్రాఫ్‌లోని పదాలను కాకుండా సమగ్రంగా అర్థాలు వచ్చే పదాలను ఉపయోగించడం వల్ల సమాధాన పత్రం దిద్దేవారికి మంచి భావన ఏర్పడుతుంది. అక్షర దోషాలు లేకుండా చూడాలి. పదాలను అర్థవంతంగా రాయాలి. వ్యాకరణ సాధన కీలకం. బాగా వచ్చిన సమాధానాలను మొదట రాసి క్లిష్టతరమైనవి చివర్లో రాస్తే ఆలోచించడానికి సమయం ఉంటుంది.
– కదార్ల రవీంద్ర, ఆంగ్లభాషా విషయనిపుణులు, నిర్మల్

పట్టు చిక్కితే గణితమే సరళం



గణితం అంటేనే విద్యార్థులు కష్టతరం, క్లిష్టతరం అని భావిస్తారు. కానీ తగిన సాధన చేస్తే గణితంలోనే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. తగిన చిట్కాలు పాటించడంతో గణితంపై ఆసక్తి పెరుగుతుంది. సమితులు, రేఖా గణితం, సాంఖ్యాక శాస్త్రం, త్రికోణమితి వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రాఫ్ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను అభ్యసన చేయాలి. ప్రాక్టీస్ చేస్తే సమాధానాలు సులభంగా రాయవచ్చు. – పెంట అశోక్, గణితశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

అభ్యసన దీపికలతో ప్రయోజనం



జీవశాస్త్రంలో బొమ్మలు గీయడం, ప్రయోగాలు నిజ జీవిత వినియోగం వంటి అంశాలపై వచ్చే ప్రశ్నల ద్వారా ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. పుస్తకంలోని కీలక అంశాలపై పట్టు సాధించాలి. – మధుసూదన్ దేశ్‌పాండే, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, సోన్

కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు తేవాలి

- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: పాతబడిన ఎస్‌డీఎల్ యంత్రాలను తీసివేసి కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలను తేవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదాలు ఆర్కే న్యూటెక గనిపై కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్ స్వామి రాజుతో భేటీ అయి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలంచెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను నడపడంతో ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సపోర్టుమెన్‌లకు పనిచేసే స్థలంలో మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వర్క్ నామ్స్ ప్రకారం కార్మికులకు పనులు కేటాయించకుండా తక్కువ మందిని కేటాయించడంతో వారిపై పనిభారం పడుతుందన్నారు. జనరల్ షిఫ్ట్ విడుదల హాజరైన కార్మికులను జన్మభూమి పేరుతో నానా రకాల పనులు చేయిస్తున్నారని, ఈ విధానం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆరుగురితో చేసే లైన్మెన్ పనికి కేవలం నలుగురిని మాత్రమే పంపుతున్నారని, దీంతో వారు పని భారంతో సతమతమవుతున్నారన్నారు. మెనూ ప్రకారం క్యాంటీన్‌లో నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలన్నారు. ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు ఏరియా కార్యదర్శి సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి సందీప్ నాయకులు నరసయ్య, శంకరయ్య, అజయ్ ఉన్నారు.

గ్రాట్యూటీ పెంచాలి

శ్రీరాంపూర్: బొగ్గుగని కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20లక్షల గ్రాట్యూటీని రూ.25 లక్షలకు పెంచాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు సోమవారం కోలిండియా, సింగరేణి యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యూటీ రూ.20లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతూ మార్చి 7, 2024న కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందన్నారు. దీన్ని మార్చి ఆగస్టు 8, 2024 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ యూనియన్ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికి, కోలిండియా యాజమాన్యంకు లేఖ రాశారన్నారు. వెంటనే గ్రాట్యూటీపై ఉన్న రూ.20లక్షల సీలింగ్‌ను ఎత్తివేసి రూ.25 లక్షలు చేయాలన్నారు.

హోలీ పండుగకు ప్రత్యేక రైళ్లు

బెల్లంపల్లి: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను వివిధ ప్రాంతాలకు నడిపించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ – గోమతినగర్, (లక్నో), సికింద్రాబాద్ –దర్భంగా, హైదరాబాద్(నాంపల్లి)– ఫాట్నా మార్గాల్లో హోలీ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా రాకపోకలు సాగిస్తాయి. సికింద్రాబాద్ నుంచి బిహార్ ముజఫర్‌పూర్ జంక్షన్ వరకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఆయా ప్రత్యేక రైళ్లు ఈ నెల 21, 28 తేదీల్లో, ఏప్రిల్ 4వ తేదీన బయల్దేరతాయి. హోలీ ప్రత్యేక రైళ్లకు రాష్ట్రంలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ కల్పిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్ జంక్షన్, కాజీపేట జంక్షన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లతో పాటు మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్‌కు అవకాశం కలిపించింది. ప్రత్యేక రైళ్లు కేవలం ఒక ట్రిప్ మాత్రమే నడవనున్నాయి. ప్రత్యేక రైళ్ల సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారి కుల విచారణ



సోమిని గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

బెజ్జూర్: మండలంలోని గబ్బాయి, లంబడిగూడ, కుకుడ, సోమిని గ్రామాలకు చెందిన నలుగురు అమ్మాయిలు నెల రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు పొందారు. ఆదివాసీ గిరిజన యువతుల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ కోయ కులం గెజిట్లో లేనందున వారి ఉద్యోగ నియామక పత్రాన్ని ఇవ్వకుండా వారు ఆదివాసీలా.. కాదా అనే దానిపై మంగళవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఏటీడీవో ఖమర్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావు లు ఆయా గ్రామాలలో విచారణ చేపట్టారు. విచారణలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీటీసీ ఆత్రం సాయి తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుడికి జస్టిస్ చంద్రయ్య పరామర్శ



సత్యనారాయణతో జస్టిస్ చంద్రయ్య..

జన్నారం: చిన్ననాటి స్నేహితుడు జన్నారం మండలం తపాలపూర్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ కమ్మల సత్యనారాయణను మంగళవారం మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య పరామర్శించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత సమస్యలపై చికిత్స పొందుతున్న అతడిని పరామర్శించి యోగా క్షేమాలు తెలుసుకున్నారు.

హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే–5గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఇంతవరకు సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రం అందించలేదని ఈ విషయంలో పలుమార్లు సీఎండీని కలిశామని ఈ నెల చివరి వారంలో తప్పకుండా గుర్తింపుపత్రం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్ రాజేశం, సంపత్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో గత ఏడాది జులై నుంచి ఫిబ్రవరి వరకూ చేపట్టిన వివిధ సేవ కార్యక్రమాలకు మంగళవారం 18 అవార్డులను పొందారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాలాజి, బెస్ట్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు, ట్రెజరర్ రామస్వామి, బెస్ట్ క్లబ్‌గా మంచిర్యాల లయన్స్ క్లబ్, బెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్‌గా మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, గుండా శ్రీనివాస్, వీరస్వామి, వి.వినయ్‌కుమార్, పి.హన్మంతరావు, కిష్టయ్య, సిరిపురం శ్రీనివాస్, ఎం.రామాంజనేయులు, సురేందర్, గోలి రాము, డేగ బాబు, సత్యపాల్‌రెడ్డి, సేవా కార్యక్రమాలు హంగర్ రిలీఫ్ ప్రోగ్రాం, ఫ్రీ ఐ సర్జికల్ క్యాంప్‌లు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, హెల్త్ క్యాంపు అవార్డులను పొందారు.

జోడువాగుల వద్ద వంతెన నిర్మించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర



పాదయాత్రలో సీపీఎం నాయకులు

భీమారం: మంచిర్యాల –చెన్నూరు జాతీయ రహదారిలో జోడువాగుల వద్ద రెండువరసల రహదారితో పాటు వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ జోడువాగు నుంచి భీమారం వరకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు, ప్రజాసంఘాల కార్యకర్తలు కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం భీమారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ ఎంతో కీలకమైన ఈ జాతీయ రహదారిలోని జోడువాగుల వద్ద దాదాపు రెండు కిలో మీటర్లు రోడ్డు విస్తరించలేదని పేర్కొన్నారు. అదే విధంగా సింగిల్ రోడ్డు వంతెన స్థితిలావస్థకి చేరుకుందని దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాల్సి ఉండగా దాదాపు 15 ఏళ్ల నుంచి అటవీశాఖ అనుమతులు లేక పనులను చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం అది కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న జాతీయ రహదారి నిర్మాణం విషయంలో అటవీశాఖ నుంచి అనుమతులు రావడం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జోడువాగు వద్ద సింగిల్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా రెండు కిలోమీటర్ల పొడువు వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా ఇందారం క్రాస్ రోడ్డు నుంచి చేపట్టిన రోడ్డు పనులు ఇప్పటికీ వరకు పూర్తి కాలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా వంతెన నిర్మించి రోడ్డు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో మహిళా సంఘాలు జిల్లా కార్యవర్గ సభ్యులు బొడెంకె చందు, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్‌కుమార్, ఐద్వా నాయకులు నిర్మల, నాగజ్యోతి పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులకు దూరం

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కంపెనీ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగులు తరచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై అత్యంత శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. వయస్సుతో పాటు వచ్చే కొన్ని దీర్ఘకాలిక జబ్బులపై అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారిన పడకుండా ఉండగలుగుతామన్నారు. అనంతరం కంపెనీ వైద్యులు కిడ్నీ, క్యాన్సర్ జబ్బులపై అవగాహన కల్పించారు. అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషా, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, గైనకాలజిస్ట్ హరిత వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఎస్ఓటూజీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు పాల్గొన్నారు.

వర్చువల్‌గా స్టాళ్ల ప్రారంభం



బెల్లంపల్లి: స్టాల్ ప్రారంభిస్తున్న అధికారులు



మంచిర్యాలక్రైం: హాజరైన ప్రయాణికులు

మంచిర్యాలక్రైం: 'ఒక స్టేషన్.. ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్రధాని మోదీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే ఏడీఎస్‌టీఈ సాయికిరణ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడారు. స్టాల్‌లో అమ్మకాలు జరుపుకొనేందుకు తెల్లరేషన్ కార్డుదారులు అర్హులని పేర్కొన్నారు. 15రోజులు ఒకరికి, 15రోజులు మరొకరికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వదేశీ వస్తువులు, చేనేత వస్త్రాలు, అల్లిక వస్తువులు, చెక్క బొమ్మలు, గాజులు తదితర వస్తువుల విక్రయానికి అవకాశంకల్పించినట్లు చెప్పారు. బీజేపీ నాయకుడు తుల మధుసూదన్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమని కొనియాడారు. రైల్వే సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో స్టేషన్‌లో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లోనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వేశాఖ ఏడీఈఈ, టీఆర్డీ ముఖేశ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు కోడి రమేశ్, సీటీఐ రాజు, సీఎస్సార్‌లు కేశవరావు, హరిత, సీసీటీసీ మోహిత్, నాయకులు యుగేందర్, రాములు, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.